రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



నీట్ పరీక్ష ఏర్పాట్లపై సమీక్షిస్తున్న
జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

# నీట్‌గా రెడీ

**◆మేడ్చల్ జిల్లాలో 12 పరీక్షా కేంద్రాలు ◆హాజరుకానున్న 3,311 మంది విద్యార్థులు ◆ఏర్పాట్లను సిద్ధం చేస్తున్న అధికార యంత్రాంగం ◆అక్రమాలకు తావులేకుండా సిసిటివి కెమేరాలు ◆అడిషనల్ కలెక్టర్ ఆదేశం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రభాతవార్త:** వైద్య విద్య సీట్ల భర్తీ కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నీట్ పరీక్షకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ నెల 21న జరగనున్న ఈ పరీక్షను ఎలాంటి ఆటంకాలు లేకుండా, అత్యంత ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు అడుగులు వేస్తున్నారు. మంగళ వారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది.
సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా మొత్తం 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా 3,311 మంది విద్యార్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. విద్యార్థులు ఎలాంటి టెన్షన్ పడకుండా, హడావుడి లేకుండా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవడం అత్యంత ముఖ్యమని, హాల్ టికెట్ వెనుక ఉన్న ప్రతి ఒక్క రూల్ అండ్ రెగ్యులేషన్‌ను అభ్యర్థులు అక్షరాలా పాటించాలని స్పష్టం చేశారు.
వేసవి కాలం, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష జరుగుతున్నంత సేపు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, ప్రతి కేంద్రంలో చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని చెప్పారు. పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు అన్ని కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అలాగే కేంద్రాల వెలుపల, లోపల గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్ష సమయంలో విద్యార్థులు ఎవరైనా అస్వస్థతకు గురైతే తక్షణ వైద్యం అందించేలా మెడికల్ కిట్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని వైద్య అధికారులను ఆదేశించారు.

**దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత**

పరీక్ష రాయడానికి వచ్చే దివ్యాంగ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. వారి కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లతో పాటు, వారు సులువుగా పరీక్షా హాల్లోకి వెళ్లేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీఓలు వెంకట్ రెడ్డి, శ్యామ్ ప్రకాష్‌తో పాటు జిల్లాకు చెందిన పలువురు ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# తుంగకుంట చెరువులో విష ప్రయోగం?

## లక్షల విలువ చేసే చేపలు మృత్యువాత



**నందిగామ, జూన్ 16, ప్రభాతవార్త :** నందిగామ మండలం మేకగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తుంగకుంట చెరువులో చేపల మృతిపై పలు అనుమానా లు రేకెత్తుతున్నాయి. సుమారు పది వేల పైగా చేపలు మృతి చెందడంపై మత్స్య సంఘం చైర్మన్ బండారి రాజు ముదిరాజ్ విచారం వెలిబుచ్చారు. చేపల మృతికి కలుషిత జలాలా..? ఎవరైనా విష ప్రయోగిం చారా..? అనే అనుమానాలు రేకేతుతున్నాయి. ఇందులో అసలు సూత్రధారులు పాత్రధారులు ఎవరు..? ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చెరువును పరిరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





# 22 స్కూళ్లకు ఒకే చోట వంట

**★మేడ్చల్ జిల్లాలో పట్టాలెక్కనున్న అల్పాహార పథకం ★ముమ్మర ఏర్పాట్లలో అధికార యంత్రాంగం ★కేంద్రీకృత వంటగది స్థలాలను పరిశీలించిన కలెక్టర్ ★ఆలియాబాదు, కేశవరంలో మూసి ఉన్న హాస్టల్ భవనాలపై దృష్టి ★పూర్తి స్థల వివరాలతో సమగ్ర నివేదికకు ఆదేశం ★కేశవరం హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ ★మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా ★ఫుట్‌బాల్, క్రికెట్ కిట్లు పంపిణీకి హామీ**

**మేడ్చల్ (శామీర్‌పేట్) జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రభాతవార్త:** ఉదయాన్నే ఆకలి కడుపులతో బడిబాట పట్టే పేద విద్యార్థులకు రుచికరమైన, పోషకాలతో కూడిన అల్పాహారాన్ని అందించేందుకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. జిల్లాలో తొలి విడతగా ఎంపిక అయిన 22 ప్రభుత్వ పాఠశాలల పిల్లల ఆకలి తీర్చేందుకు ఒకే చోట వంటలు వండే కేంద్రీకృత వంటగది (సెంట్రలైజ్డ్ కిచెన్) ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈ మహత్కార్యానికి వేదికను సిద్ధం చేసేందుకు జిల్లా కలెక్టర్ మనుచౌదరి మంగళవారం శామీర్‌పేట్, మూడుచింతలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో అధికారులను పరుగులు పెట్టించారు.
జిల్లా అంతటా సజావుగా అల్పాహారాన్ని సరఫరా చేసేందుకు అనువైన స్థలం కోసం ఆలియాబాదు, కేశవరం గ్రామాల్లో ప్రస్తుతం మూసివేసి ఉన్న బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్ భవనాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవనాలు ఎప్పటి నుండి మూసి ఉన్నాయి? ఎంత స్థలం అందుబాటులో ఉంది? అనే వివరాలను జిల్లా బీసీ సంక్షేమ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు హాస్టళ్ల పూర్తి స్థల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను వెంటనే తనకు సమర్పించాలని సంబంధిత ఎంఆర్‌ఓలను ఆదేశించారు.

**కలెక్టర్ హామీతో కేశవరం విద్యార్థులు ఫిదా**

అనంతరం కేశవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, ఈ విద్యా సంవత్సరంలో జరిగిన కొత్త అడ్మిషన్ల వివరాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. భోజనం ఎలా ఉంది? ఆడుకోవడానికి ఆట వస్తువులు ఉన్నాయా? ఇంకా ఏమైనా కావాలా? అని పిల్లలను ఆప్యాయంగా ప్రశ్నించారు. విద్యార్థులు తమకు ఫుట్‌బాల్, క్రికెట్ కిట్లు కావాలని కోరగా, సానుకూలంగా స్పందించిన కలెక్టర్, త్వరలోనే వాటిని అందిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ హామీతో విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

**కాంట్రాక్ట్ ఏజెన్సీకి సూచనలు**

జిల్లా అంతటా అల్పాహారాన్ని నాణ్యంగా, సకాలంలో సరఫరా చేసే బాధ్యతను కాంట్రాక్ట్ ఏజెన్సీ మన్న ట్రస్ట్ తీసుకోనుంది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై, విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, చిన్న పొరపాటు కూడా జరగకూడదని స్పష్టమైన మార్గదర్శ కాలను అందజేశారు. ఈ పర్యటనలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణి, శామీర్‌పేట్ ఎంఆర్‌ఓ శ్రీనివాస్, మూడుచింతలపల్లి ఎంఆర్‌ఓ మహమ్మద్ ఇద్రీస్, పాఠశాల ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అల్పాహార పథకం వంటశాల కోసం నిరుపయోగంగా ఉన్న బిసి హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కేశవరం హైస్కూల్ విద్యార్థులతో మాటామంతీ

**రంగారెడ్డి అర్బన్, జూన్ 16, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లాలో భూముల విలువలు ఆకాశాన్నంటుతున్న వేళ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో జిల్లా సర్వే శాఖలో పనిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులుపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ఇంకా చర్చనీయాంశంగా ఉండగానే, తాజాగా డిప్యూటీ డైరెక్టర్ నరహరిపై ఏసీబీ నిర్వహించిన సోదాలు భూ పరిపాలన వ్యవస్థపై కొత్త ప్రశ్నలకు దారితీశాయి. హైదరాబాద్ శివారు ప్రాంతాలైన మహేశ్వరం, శంషాబాద్, ఆదిబట్ల, రావిర్యాల, కొల్లూరు, మొక్కిల, చేవెళ్ల, మోమిన్‌పేట్ తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ విస్తరణతో భూముల విలువలు అమాంతం పెరిగాయి. ఈ నేపథ్యంలో సర్వే నంబర్ల నిర్ధారణ, భూ హద్దుల నిర్ణయం, ప్రభుత్వ భూముల గుర్తింపు, రికార్డుల సవరణ వంటి అంశాల్లో సర్వే శాఖ అధికారుల పాత్ర అత్యంత కీలకంగా మారింది.
నరహరి 2018-19 కాలంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్)గా పనిచేశారు. అనంతరం పదోన్నతులు పొందుతూ ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయనకు సంబంధించిన నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ సోదాలు నిర్వహించగా భారీ స్థాయిలో ఆస్తుల వివరాలు బయటపడినట్లు ప్రాథమిక సమాచారం వెలువడింది. నగదు, బంగారం, స్థిరాస్తుల పత్రాలు, బ్యాంకు లావాదేవీల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇదే శాఖలో గతంలో పనిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులుపై 2025లో ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. దర్యాప్తులో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో స్థిరాస్తులు, వ్యవసాయ భూములు, రైస్ మిల్, విలువైన ప్లాట్లు, నగదు, బంగారం, వాహనాలు గుర్తించినట్లు అప్పట్లో అధికారులు వెల్లడించారు. భూ రికార్డుల నిర్వహణ, సర్వే ప్రక్రియలకు సంబంధించిన వివాదాస్పద వ్యవహారాలు కూడా వెలుగులోకి వచ్చాయి.

# అవినీతి సామ్రాట్

**✸ఎసిబి వేటలో చిక్కిన తిమింగలాలు ✸రంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రకంపనలు ✸నాడు శ్రీనివాసులు.. నేడు నరహరి! ✸భూ పరిపాలనను ముంచెత్తిన లంచాల జాతర ✸కాసుల కక్కుర్తిలో అసిస్టెంట్ డైరెక్టర్లు ✸మున్సిపల్ విభాగాన్ని కుదిపేసిన స్కామ్‌లు**

**భూ సంస్కరణలలో ఫలిమెంత?**

రంగారెడ్డి జిల్లా భూముల విలువల పరంగా రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాంతంగా మారడంతో సర్వే శాఖపై ఒత్తిడి, ప్రభావం కూడా పెరిగిందని నిపుణులు పేర్కొంటున్నారు. వేల కోట్ల రూపాయల విలువైన భూముల రికార్డుల నిర్వహణలో చిన్న మార్పు కూడా భారీ ఆర్థిక లాభనష్టాలకు కారణమవుతుండటంతో సర్వే వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో భూ రికార్డుల డిజిటలైజేషన్, జీపీఎస్ ఆధారిత సర్వేలు, ఆన్‌లైన్ పర్యవేక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని భూ పరిపాలన నిపుణులు సూచిస్తున్నారు. భూములకు సంబంధించిన వివాదాలు, అవినీతి ఆరోపణలు తరచూ వెలుగుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు ఎంత మేర ఫలిస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**భర్త లీక్ చేసిన వీడియోతో డీఈ గుట్టు రట్టు**

మరోవైపు గతంలోనూ మున్సిపల్, ఇంజనీరింగ్ విభాగాల్లోని లంచావతారాల గుట్టు రట్టయింది. రాజేంద్రనగర్ మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ ఒక హోటల్ యజమానిని బెదిరించి రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలపన్ని పట్టుకుంది. అలాగే మణికొండ మున్సిపల్ పరిధి జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి సాధారణ నల్లా కనెక్షన్ ఇవ్వడానికి రూ. 30 వేలు డిమాండ్ చేసి దొరికిపోయింది. ఇదే మణికొండ పరిధిలో ఇంజనీరింగ్ డీఈ వ్యజ్యోతి సాగించిన అక్రమాల బాగోతం మరింత సంచలనం సృష్టించింది. ఆమె కూడబెట్టిన అక్రమాస్తులకు సంబంధించిన వీడియోలను స్వయంగా ఆమె భర్తే సోషల్ మీడియాలో లీక్ చేయడంతో ఆ దృశ్యాలు వైరల్ అయ్యాయి, దీనితో ఉన్నతాధికారులు ఆమెను తక్షణమే విధులనుంచి తప్పించారు.

**ఇరిగేషన్ శాఖలో రూ. 500 కోట్ల అక్రమ సామ్రాజ్యం**

నీటిపారుదల (ఇరిగేషన్) శాఖలో వెలుగుచూసిన అవినీతి తిమింగలాల కథ మరింత విస్తుగొలిపేలా ఉంది. నెక్నాంపూర్లలోని ఒక నిర్మాణానికి నిరభ్యంతర పత్రం ఇవ్వడానికి రూ. 2.50 లక్షల లంచం డిమాండ్ చేస్తూ ఇరిగేషన్ ఏఈ నిఖేష్ ఏసీబీకి చిక్కాడు. ఈయన సామ్రాజ్యాన్ని తవ్వితీసిన అధికారులకు దాదాపు రూ. 500 కోట్లకు పైగా అక్రమాస్తులు ఉన్నట్లు తేలడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ భారీ స్కామ్‌లో భాగస్వాములుగా ఉన్న ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ బన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్ కార్తీక్‌లను కూడా అధికారులు అరెస్ట్ చేసి ఊచల వెనుకకు నెట్టారు.

**కరెంట్ మీటర్ల నుండి జీఎస్టీ వరకు కక్కుర్తి**

విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖల్లోనూ ఇదే తీరు కొనసాగింది. గచ్చిబౌలి డివిజన్ విద్యుత్ శాఖ ఏడీఈ సతీశ్ గోపన్నపల్లిలో ఒక భవనానికి మీటర్ మంజూరు చేయడానికి రూ. 50 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోగా, విచారణలో ఈయన వెనుక వంద కోట్ల అక్రమ సామ్రాజ్యం ఉన్నట్లు తేలింది. అలాగే మాదాపూర్ డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ ఎం. సుధ ఒక చిన్న కంపెనీ జీఎస్టీ రిజిస్ట్రే షన్ కోసం కేవలం రూ. 8 వేల లంచానికి కక్కుర్తి పడి ఏసీబీకి దొరికిపోయింది. వీరందరితో పాటు అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వై. మదన్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ పి. కృష్ణయ్యలు సైతం అవినీతి ఆరోపణల సుడిగుండంలో చిక్కుకుని వార్తల్లో నిలిచారు. ఒకే జిల్లా పరిధిలో ఇంతమంది ఉన్నతాధికారులు వరుసగా ఏసీబీ బోనులో నిలబడటం వ్యవస్థలో వేళ్లూనుకున్న అవినీతి నెట్వర్క్‌కు అద్దం పడుతోంది.







ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

# ధరల దందా చేస్తే లైసెన్స్ కట్

## ఎరువులు, విత్తనాల వ్యాపారులకు కలెక్టర్ హెచ్చరిక

**వికారాబాద్, ప్రభాతవార్త:** ఎరువులు, విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ధనలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ధరల పట్టిక, నిలువల రిజిస్టర్ ను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మాత్రమే విక్రయించాలని ఆయన తెలిపారు. డీలర్లు అక్రమాలకు పాల్పడినట్లయితే చట్టరీత్యా తీసుకోవడం జారుగుతుందని మిగతా 2లో

# అనాథ పిల్లలకు ఆశ్రమ పాఠశాల

## డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఉచిత వసతి, భోజన సౌకర్యాలు

## రేపు ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్



తలకొండపల్లిలో నిర్మించిన ఉప్పల ఆశ్రమ పాఠశాల భవనం

**తలకొండపల్లి జూన్ 16, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా విస్తృతమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వీటన్నింటితో పాటు, కల్వకుర్తి తాలూకాలోని నిరుపేద బాలికల కోసం (ముఖ్యంగా తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ) అన్ని వసతులతో కూడిన ఒక ఉచిత ఆశ్రమ రెసిడెన్షియల్ పాఠశాలను ట్రస్ట్ నిర్మించింది. డిజిటల్ క్లాస్ రూమ్‌లు, అత్యంత సురక్షితమైన వాతావరణం, ఉచిత వసతి, భోజన సౌకర్యాలు మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యా యులతో కూడిన ఈ మూడు అంతస్తుల అత్యాధునిక పాఠశాల భవనాన్ని ఈ నెల 18వ తేదీన ప్రారంభించ నున్నారు. ఈ విధంగా ఉప్పల చారిట బుల్ ట్రస్ట్ నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోంది. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభిం చిన సమయంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేం దుకు ముందస్తు జాగ్రత్తగా ఉచితంగా మందు లను పంపిణీ చేసి ట్రస్ట్ అండగా నిలిచింది. విద్య రంగంలో వెనుకబడిన, నిరుపేద విద్యార్థిని విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ట్రస్ట్ ద్వారా అనేకమందికి వ్యక్తిగతంగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
పేద ప్రజల సొంతింటి కలను నైజం చేసుకునేందుకు, తలకొండపల్లి మండలంతో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అర్హులైన నిరుపేదలను గుర్తించి, వారి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మెటీరియల్/సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే వైద్య సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే ఉద్దేశంతో, అత్యవసర సమయాల్లో ఉపయోగపడేలా తలకొండపల్లి మండలంలో ఒక ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది. పేద కుటుం బాలలో ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి బాసటగా నిలుస్తూ, వారి దహన సంస్కారాల (అంత్యక్రియల) ఖర్చుల నిమిత్తం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఇప్పటికే వ్యక్తిగతంగా రూ. 3,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు.

# పోలీసు శాఖపై నమ్మకం మరింత పెరగాలి



పోలీస్ స్టేషన్లో కేసుల వివరాలను తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** వికారాబాద్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా మంగళవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ రూమ్‌లతో పాటు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కీలక రికార్డులను, బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల నిర్వహణను, వివిధ కేసుల ఫైళ్లను తనిఖీ చేసి, పెండింగ్ కేసుల వివరాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో, ప్రజలతో సిబ్బంది ఎల్లప్పుడూ మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బాధితుల సమస్యలపై తక్షణమే స్పందిస్తూ వారికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడా లన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మిగతా 2లో

# మార్కెట్ యార్డుకు ముందడుగు

**39.07 ఎకరాల ప్రభుత్వ భూమి అప్పగింత**

**వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు తగ్గనున్న దూరాభారం**

**మొయినాబాద్, జూన్ 16, ప్రభాతవార్త :** రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయించుకునేందుకు, వారికి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు అందించేందుకు మొయినాబాద్ మండలంలో నూతన మార్కెట్ యార్డు ఏర్పాటుకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా రైతులకు ఉపయోగపడే విధంగా మార్కెటింగ్ శాఖకు 39.07 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారికంగా అప్పగించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె. ప్రతీక్ జైన్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. సోమవారం మార్కెటింగ్ శాఖ అధికారులకు భూమిని అప్పగించామని తాసిల్దార్ గౌతమ్ కుమార్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమాయత్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 151లో ఉన్న ప్రభుత్వ భూమితో పాటు అజీజ్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 176లోని భూమిని కలిపి మొత్తం 39.07 ఎకరాల భూమిని మార్కెటింగ్ శాఖకు బదిలీ చేశారు. ఈ భూమిని గూడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణానికి వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి మహమ్మద్ రియాజ్, గూడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి పి. ప్రసాద్ రావుకు రెవెన్యూ అధికారులు భూమి స్వాధీన పత్రాలను అందజేశారు. అనంతరం మండల గిర్దావర్ రాజేష్ పంచనామా నిర్వహించి భూమి హద్దులను గుర్తించారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు సంబంధిత రికార్డులను పరిశీలించి అధికారికంగా అప్పగింత ప్రక్రియను పూర్తి చేసామని పేర్కొన్నారు .ప్రస్తుతం మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్ తదితర మిగతా 2లో

## ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా

**పెద్దేముల్, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సంబందిత అధికారులను ఆదేశించారు. తాండూరు నియోజకవర్గంలోని విద్యుత్ సరఫరా సమస్యలపై విద్యుత్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏర్పడిన విద్యుత్ సమస్యలను సమీక్షించి, వాటిని త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం లో అప్రమత్తంగా ఉండి, ప్రజలకు, రైతులకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని అధికారులకు ఆదేశించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**పెద్దేముల్, జూన్ 16, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు మొక్కలను నాటాలని ఆర్‌బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు, యాలాల మండలాల్లో పెద్ద ఎత్తున వివిధ రకాల పండ్ల మొక్కలను ఆర్‌బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ బుయ్యని సరళారెడ్డి నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వాతవరణం వర్షాలకు అనుకూలంగా లేదని చెప్పారు. భావితరాల మేలు కోసం పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని సూచించారు. కాని తమ పుట్టిన రోజైన, పెళ్ళి రోజైన మొక్కలను నాటేందుకు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీనన్న యూత్, శీనన్న యువదళ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో గ్రామాలు అభివృద్ధి

**పెద్దేముల్, జూన్ 16, ప్రభాతవార్త:** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనో హర్‌రెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సిములు అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండ లం హన్మాపూర్ గ్రామంలో సీఆర్ఆర్ గ్రాంటు నిధులు రూ.75 లక్షలతో రోడ్డు పనులను లొంక నర్సిములు ప్రారంభించారు. ఈ సందర్భంగా లొంక నర్సి ములు మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, గ్రామాలకు పక్కా రహదారుల నిర్మాణాలు అవుతు న్నాయని అన్నారు. మండల అభివృద్ధి కోసం కృషిచేస్తున్న ఎమ్మెల్యే మనో హర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లొంక రాము లు, నాయకులు పంజుగుల మల్లేష్, పంజుగుల విజయ్, పంజుగుల రఘు పతి, చెన్నని నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన విషయంలో అలసత్వం వద్దు

**పెద్దేముల్, జూన్ 16, ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మండల విద్యాధికారి నర్సింగ్‌రావు హెచ్చరించారు. మంగళవారం పెద్దేముల్ మండలం నర్సాపూర్, బుద్దారం, తింసాన్‌పల్లి పాఠశాలలను ఎంఈఓ సందర్శించి పిల్లల హజరు శాతము, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు విద్యార్థులకు అందజేశారా లేదా అనే విష యాలను యంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లా డుతూ మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం విద్యార్థులకు తప్పకుండా అందించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన విషయంలో ఎక్కడ కూడా లోటుపాట్లు లేకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తింసాన్‌పల్లి ఎంపిపిఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు ఏజెన్సి ద్వారా తయారు చేయించి అందించడం జరిగిందని తెలిపారు.

## ట్రాఫిక్ పోలీసుల సేవా దృక్పథానికి ప్రశంసలు

**చేవెళ్ల, జూన్ 16, ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరంలో వర్షాకాలం ప్రారం భం కావడంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు ఏర్పడి, వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నా రు. ఈ నేపథ్యంలో గచ్చిబౌలి పరిధిలోని విప్రో సర్కిల్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను గమనించిన ట్రాఫిక్ పోలీసులు దుష్యంత్ రెడ్డి, రాజశేఖర్ వెంటనే స్పందించారు. రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాల అవకాశాలు పెరుగుతున్నాయని గుర్తించిన వారు, అటుగా వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీ డ్రైవర్‌తో మాట్లాడి, లారీలో మిగిలి ఉన్న కాంక్రీట్‌ను గుంతల్లో వేయించి వారే స్వయంగా గుంతలను పూడ్చివేశారు. దీంతో వాహనదారులకు కొంత ఉపశమనం లభించింది. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, సమస్యను గుర్తించిన వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసుల సేవా భావాన్ని స్థానికులు అభినందించారు. అధికారికంగా సంబంధిత శాఖలు శాశ్వత మరమ్మతులు చేపట్టే వరకు ప్రమాదాలను తగ్గించేందుకు చేసిన ఈ ప్రయత్నం ప్రజల్లో ప్రశంసలు అందుకుంది. ప్రజల సౌకర్యం కోసం విధి నిర్వహణకే పరిమితం కాకుండా, సమస్య పరిష్కారానికి ముందడుగు వేసిన ట్రాఫిక్ పోలీసుల చర్య ఆదర్శప్రాయమైంది.. అని స్థానికులు పేర్కొన్నారు.

## నేడు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

**ధారూర్, జూన్ 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మున్నూరు సోమారం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించనున్న మెయింటెనెన్స్ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఏఈ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. నేడు బుధవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు 33కెవి విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల దృష్ట్యా కొండాపూర్ కాలనీ, ధర్మాపూర్, మున్నూరు సోమారం, ఎబ్బనూరు, గోధుమగూడ, జైదుపల్లి, బాచారం ,కెరెల్లి, కొండాపూర్ ఖుర్దు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. కావున, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, అధికారులకు సహకరించవలసిందిగా ఏఈ వేణుగోపాల్ రెడ్డి కోరారు.


స్థల స్వాధీన పత్రాలను అందుకుంటున్న అధికారులు

## మార్కెట్ యార్డుకు ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

మండలాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేందుకు దూర ప్రాంతాల్లోని మార్కెట్లపై ఆధారపడాల్సి వస్తోంది. నూతన మార్కెట్ యార్డు అందుబాటులోకి వస్తే రైతులు తమ పంటలను సమీప ప్రాంతంలోనే విక్రయించుకునే అవకాశం లభించనుంది. అలాగే రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు మెరుగుపడనున్నాయి. మార్కెట్ యార్డు నిర్మాణంలో రైతుల అవసరాలకు అనుగుణంగా వేలం పాటల షెడ్లు, గోదాములు, తూకం యంత్రాలు, తాగునీటి సౌకర్యం, పార్కింగ్ స్థలాలు, రైతు విశ్రాంతి గదులు, కార్యాలయ భవనాలు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. రైతులు తమ పంటలను భద్రంగా నిల్వ చేసుకునేందుకు అవసరమైన సదుపాయాలు కూడా కల్పించనున్నారు. ఇప్పటికే సుమారు 20.33 ఎకరాల భూమిని మార్కెటింగ్ శాఖకు కేటాయించినట్లు అధికారులు పేర్కొన్నారు. అదనంగా మరో 60 ఎకరాల భూమిని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మార్కెట్ యార్డు విస్తరణకు అవసరమైన భూమిని ముందుగానే గుర్తించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ మార్కెట్ యార్డు ఏర్పాటు పూర్తయితే మొయినాబాద్ ప్రాంత రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరనుందని, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, విక్రయాల్లో పారదర్శకత పెరిగి రైతుల ఆదాయం మెరుగుపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మార్కెటింగ్ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి మల్లేశం వైస్ చైర్మన్ చంద్రశేఖర్ అజీజ్ నగర్ జిపిఓ నరసింహ నగర్ జిపిఓ హరిత రవి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా ప్రాంగణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**మొయినాబాద్, జూన్ 16, ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలంటే గ్రామ స్థాయిలో క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించడం అత్యంత అవసరమని తోల్కట్ట గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మొయినాబాద్ మండల పరిధిలోని తోల్కట్ట గ్రామ క్రీడా ప్రాంగణ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని యువత, విద్యార్థుల్లో క్రీడల పట్ల మంచి ఆసక్తి ఉన్నప్పటికీ సరైన మౌలిక సదుపాయాల లేమి కారణంగా వారి ప్రతిభ వెలుగులోకి రావడం లేదన్నారు. గత ప్రభుత్వం తోల్కట్ట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 133లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ స్థలంలో గ్రామానికి చెందిన విద్యార్థులు, యువకులు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడలు ఆడుతూ శిక్షణ పొందుతున్నారని తెలిపారు. అయితే క్రీడా మైదానంలో ఎలాంటి మౌలిక వసతులు లేకపోవడంతో క్రీడాకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మైదానం చదును చేయడం, రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు, వాలీబాల్ కోర్టు, కబడ్డీ కోర్టు, క్రీడా సామగ్రి, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ప్రహరీ గోడ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలు ఉన్నాయని, అందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తోల్కట్ట క్రీడా ప్రాంగణాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశామని తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి సమస్యను పరిశీలించి క్రీడా ప్రాంగణ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వడ్ల రవీందర్ చారి భానూరి ఇంద్రసేనగౌడ్ యాతం నాని చనువల్లి కృష్ణ కోమటి శ్రీను దాసరి వినయ్ క్రికెట్ యోజన యూత్ నాయకులు కేసారం శ్రీకృష్ణ భానూరి యాదగిరి గౌడ్ , యువకులు, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న తోల్కట్ట గ్రామస్తులు

# అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించండి

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. మంగళవారం అనంతగిరి పర్యావరణ పర్యాటక కేంద్ర ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనులను పరిశీలించారు. జిల్లాలోని అనంతగిరి ప్రాంతంతో పాటు సర్పన్ పల్లి, కోట్ పల్లి ప్రాజెక్ట్ పర్యాటక అభివృద్ధికి పరిశీలించాలని ఆయన తెలిపారు. జిల్లాలోని ఆధ్యాత్మిక ప్రదేశాలను గుర్తించి పర్యాటక అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలలో అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ లను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, టూరిజం, అటవీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

# ఘనంగా నూతన పాఠశాల భవన ప్రారంభోత్సవం


అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, సర్పంచ్ రాజు

**దౌల్తాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజక వర్గం పరిధిలోని దౌల్తాబాద్ మండలం దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలో నూత నంగా నిర్మించిన పాఠశాల భవనం అదనపు తరగతి గదుల ప్రారంభో త్సవ కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం-పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖాధ్వర్యంలో, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కాడ) నిధులు రూ.61.00 లక్షల వ్యయం తో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అదనపు తరగతి గదులను నిర్మించారు. ఈ అత్యాధునిక విద్యా వసతులను రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎనుముల తిరుపతి రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎను ముల తిరుపతి రెడ్డికి, ఇతర ముఖ్య నాయకులకు స్థానిక ప్రజా ప్రతిని ధులు, కాంగ్రెస్ శ్రేణులు,గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నేతలు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పట్టణాలకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ నిధు లను కేటాయిందని పేర్కొన్నారు.

నూతన గదుల ఏర్పాటుతో విద్యా ర్థులకు మెరుగైన, ఆహ్లాదకరమైన వసతులు అందుబాటులోకి వచ్చాయని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ ఘనమైన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ కూర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, కొడంగల్ మార్కెట్ కమీటి చైర్మన్ అంబయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్‌రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కూర వెంకట్‌రాములు, సత్యపాల్, రాజశేఖర్‌రెడ్డి, నర్సప్ప, రాజగోపాల్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తమ గ్రామంలో ఇంతటి ఆధునిక పాఠశాల భవనాన్ని అందుబాటులోకి తెచ్చినందుకు దేవర్‌ఫసల్‌వాద్ గ్రామ ప్రజలు ప్రభుత్వానికి,స్థానిక నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీధర్మశాస్త్ర సేవా సమితి కార్యవర్గం నుంచి ముగ్గురు తొలగింపు

**ఘట్‌కేసర్, జూన్ 16, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడ శ్రీధర్మశాస్త్ర సేవాసమితి కార్యవర్గానికి వ్యతిరేకంగా పనిచేసిన ముగ్గురిని తొలగిస్తున్నట్లు సమితి అధ్యక్షులు కొంతం నర్సింహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల సత్యనారాయణయాదవ్‌లు తెలిపారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ సమితి సభ్యులు సమావేశమై వ్యతిరేకంగా మాట్లాడిన సంయుక్త కార్యదర్శి గుండ్ల రామతీర్థ, సభ్యులు మడిపడిగె శంకర్, బండారి జగదీశ్వర్‌లను అందరి తీర్మాణం మేరకు తొలగించినట్లు తెలిపారు. శ్రీధర్మశాస్త్ర సేవాసమితి కార్యనిర్వహణ కమిటీ సభ్యుత్వం నుంచి ముగ్గురిని తొలగించామని కమిటఎపై ఎలాంటి అధికారం, ప్రాతినిధ్యం వహించే అధికారం లేదని కార్యకలాపాల్లో జోక్యం చేసుకునే హక్కు ఉండదని వారు స్పష్టం చేశారు. శివారెడ్డిగూడ శ్రీదండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీధర్మశాస్త్ర సేవా సమితిని సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి 1987-88లో స్థాపించారని బర్ల అంజనేయులు సమితి వ్యవస్థాపకులు కాదని తెలిపారు. ప్రతిరెండు సంవత్సరాలకు ఒక సారి కమిటీ ఎన్నిక జరుగుతుందని ప్రస్తుతం ఉన్న కమిటీని రద్దు చేసే అధికారం ఎవరికి లేదని రిజిస్ట్రేషన్ 1145/2024 ఉందని తెలిపారు. అక్టోబర్ నుంచి జనవరి వరకు అయ్యప్ప స్వామి సన్నిధానంలో కార్యకలాపాలు జరుగు తాయని ఇతర సమయాల్లో సన్నిధానంపై మాట్లాడవద్దని సభ్యులకు సూచించారు. శ్రీధర్మశాస్త్ర సేవా సమితి కార్యనిర్వహణ కమిటీపై అసత్య ప్రచారం చేయకూడదని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నేడు ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన

**మోమిన్‌పేట్, జూన్ 16, ప్రభాతవార్త:** జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాలమేరకు నేడు అనగా 17.06.26, బుధవారం ఉదయం 7:00 గంటలకు (ఎస్ఐఆర్) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తహశీల్దార్ మునీరుద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు ఇట్టి కార్యక్రమం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని అంబేద్కర్ ప్రధాన కూడలి నుండి వేధా ఆసుపత్రి వరకు 2కే రన్ సామూహికంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజకీయాలకతీతంగా ప్రతి రాజకీయ పార్టీల ప్రతినిధులు, (బీఎల్ఓ)లు బూత్ లెవల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు, ప్రజాప్రతినిధులు, మరియు మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిదులు, ప్రజలు, మహిళలు ప్రతి ఒక్కరు ఈ 2కే రన్ లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమం ద్వారా ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, తొలగింపు, మరియు మార్పు,చేర్పులకు సంభందించిన అంశాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం కొరకే ఈ అవగాహన కార్యక్రమం యొక్క ముఖ్యోద్దేశమని తహశీల్దార్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అర్హుడైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడం, తమ ఓటరు వివరాలను సక్రమంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

## బోనాల జాతరకు భాగ్యనగరం ముస్తాబు

**హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక గా నిలిచే ఆషాఢ బోనాల జాతర మహోత్స వాలకు భాగ్యనగరం ముస్తాబవుతోంది. వచ్చే నెల 19వ తేదీన గోల్కొండ జగదాంబ అమ్మవా రికి తొలి బోనం సమర్పించడంతో ఈ చారిత్రా త్మక ఉత్సవాలు అధికారికంగా ప్రారంభం కాను న్నాయి. దాదాపు నెల రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు ఆగస్టు 10వ తేదీ వరకు హైద రాబాద్ మహానగరంలో అంగరంగ వైభవంగా కొనసాగుతాయని ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఆషాఢ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని జూలై 19న గోల్కొండ కోటలో జగదాంబ అమ్మ వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, తొలి బోనం సమర్పిస్తారు. అదే రోజున నగరం లోని పలు ప్రధాన ఆలయాల్లో ఘటాల ఊరేగిం పు కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభించనున్నారు. నాటి నుంచి ప్రతి ఆది, గురువారాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణలు ఉంటాయి. అత్యంత కీలకమైన ఘట్టాలు ఆగస్టు మొదటి వారంలో జరగనున్నాయి. ఆగస్టు 2 ఆదివారం లష్కర్ (సికింద్రాబాద్) ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలను సమర్పిస్తారు. జాతర మరుసటి రోజైన ఆగస్టు 3వ తేదీ సోమవారం ఉదయం 8:30 గంటలకు భవిష్యవాణిని వినిపించే ప్రసిద్ధ రంగం కార్యక్ర మం జరగనుంది. ఆ తర్వాత ఉదయం 10:30 గంటల సమయంలో అత్యంత కోలాహలంగా అ మ్మవారి గజవాహన ఊరేగింపు మహోత్సవాన్ని జరుపుతారు. ఆగస్టు 10న లాల్ దర్వాజా సిం హవాహిని అమ్మవారు, పాతబస్తీలోని ఉమ్మడి దేవాలయాలతోపాటు నగర వ్యాప్తంగా బోనాల ఉత్సవాలతో ముగుస్తుంది. ఉమ్మడి దేవాలయా ల ఘటాల సామూహిక ఊరేగింపు. గజరాజుపై అమ్మవారి శోభాయాత్రతో ఈ ఏడాది ఆషాఢ బోనాల జాతర ముగియనుంది. బోనాల పండు గను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే దుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ముందస్తు ఏర్పాటు చేస్తోంది.


పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ కీర్తిహరీష్

## ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ

**షాబాద్, జూన్ 16, ప్రభాతవార్త :** సర్కార్ బడిలో చదవులు మీ పిల్లల జీవితంలో వెలుగులు నింపుతుందని ఎంఈవో లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ కీర్తిహరీష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సర్దార్ నగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, ఇందులో భాగంగా నాణ్యమై విద్యను మంచి సౌకర్యా లతో ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాల మెరుగుపరుస్తూ ముందుకు పోతుందన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి వాటిని మరింత బలోపేతం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రత్నాలయం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బిజెపి నాయకులు

## మోడీ హయాంలోనే అన్ని రంగాలు అభివృద్ధి

**శామీర్‌పేట, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని, ఆయన తీసు కుంటున్న నిర్ణయాలే ఈ అభివృద్ధికి నిదర్శనమని అలియాబాద్ మున్సి పల్ బిజెపి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం శామీర్‌పేట మండ లంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని రత్నాలయంలో శ్రీవేం కటేశ్వరస్వామిని ఆలయంలో అలియాబాద్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాల తిమాదవరెడ్డి, కౌన్సిలర్ కైర గణేశ్, పలువురు బిజెపి నాయకులు దర్శిం చుకుని పూజలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి చెందాలని వారు కోరుకున్నారు. ప్రధాన మంత్రి దేశం కోసం, ధర్మం కోసం, దేశాభివృద్ధి కోసం నిరంతరం పనిచే స్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నీరుడి అశోక్‌కుమార్, గౌరారం రమేష్, మల్యాల మహేశ్‌కుమార్, శరత్‌కుమార్, భీమానాయక్, కె.యాదగిరి, సిహెచ్ వెంకటేశ, శ్రీశైలంయాదవ్, వెంకటేశ, చిటుకుల సత్యనారాయణ, శ్రీనివాస్‌యాదవ్, యు.సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**శామీర్‌పేట, జూన్ 16, ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని మండల సిఐటియు కార్యదర్శి ఎం.కిష్టప్ప ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు నెలకు కనీస వేతనం 26వేలు చెల్లించాలని, ఇఎస్ఐ కార్డు, పిఎఫ్ స్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు ఒక పూట డ్యూటీ, వారాంతపు సెలవులు, పండుగ సెలవులు ఇవ్వాలని, సోప్స్, ఆయిల్, యూనిఫామ్స్, ఈఎస్ఐ కార్డు, పిఎఫ్ స్లిప్ , కనీస వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. అందరికి డబుల్‌బెడ్‌రూమ్స్ ఇళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సిఐటియు సహాయ కార్యదర్శి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ము త్యాలు, సుదాకర్, ఆరోగ్యం, సిపిఎం నాయకులు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే లక్ష్యంగా 'మీ సురక్ష'

**జవహర్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త:** ప్రజల భద్రతే లక్ష్యంగా నిర్వహి స్తున్న మీ సురక్ష కార్యక్రమంలో భాగంగా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ, జమ్మిగడ్డ, యాప్రాల్, కౌకూర్, బాలాజీ నగర్ తదితర కాలనీలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారు. ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించడంతో పాటు నేరాల నివారణకు అవసరమైన జాగ్రత్తలను ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. ఇంట్లో పనిచేసే సర్వెంట్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బందిని నియమించుకునే సమయంలో వారి ఆధార్ కార్డు, చిరునామా వివరాలు, కుటుంబ నేపథ్యం వంటి వివరాలను తప్పనిసరిగా సేకరించాలని ప్రజలకు సూచించారు. అలాగే ఇళ్లను అద్దెకు ఇచ్చే యజమానులు అద్దెదారుల గుర్తింపు పత్రాలు, ఫోన్ నంబర్లు, ఇతర అవసరమైన డాక్యుమెంట్లను పరిశీలించిన తర్వాత మాత్రమే అద్దెకు ఇవ్వాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్ సైదులు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది వివిధ కాలనీల్లో పర్యటించి స్థానికులతో సమావేశమయ్యారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ భద్రతా చర్యలను పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి కాలనీవాసులు, సంఘ ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు.

## కీసర ఆర్డీఓగా వెంకట్‌రెడ్డి బాధ్యతలు

**శామీర్‌పేట, జూన్ 16, ప్రభాతవార్త:** కీసర ఆర్డీఓగా నల్ల వెంకట్‌రెడ్డి ఇటీవలనే బాధ్యతలు స్వీకరించటంతో ఆయనను మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆ నూతన ఆర్డీఓను సన్మానించారు. మంగళవారం కీసర ఆర్డీఓగా కార్యాలయంకు జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పలువురు నాయకులతో కలిసి వెళ్లి నూతన ఆర్డీఓ నల్ల వెంకట్‌రెడ్డిని సన్మానించి స్వాగతించారు. ఆయనతో పాటు దేవర యాంజాల్ రామాలయ మాజీ ధర్మకర్త టి.జగదీశ్‌గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ధరల దందా చేస్తే లెసెన్స్ కట్

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠ శాలను సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులు అధిక శాతంలో పాఠశాలకు హాజరయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యా యుల కు సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గత సంవత్స రం ఉత్తీర్ణత శాతం అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం, తహసిల్దార్ లక్ష్మీ మ్మనారాయణ, ఎంపీడీఓ వినయ్ కుమార్ లు ఉన్నారు.

## పోలీసు శాఖపై నమ్మకం మరింత పెరగాలి

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని, వికారాబాద్ పట్టణంలో నేరాల నియంత్రణకు గానూ సీసీటీవీ కెమెరాల నిఘాను నిరంతరం పర్యవేక్షి ంచాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ పెండింగ్ కేసులను త్వరగా ఛేదించాలని సూచించారు. విధి నిర్వహణతో పాటు సిబ్బంది ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటేనే పని తీరు మరింత మెరుగవుతుందని గుర్తుచేశారు. ప్రజలకు పోలీసు శాఖపై మరింత నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆమె ఆదేశించారు.

## వరద నివారణకు సమన్వయంతో పనిచేయండి

**హైదరాబాద్, జూన్ 16 ప్రభాతవార్త :**

వర్షాకాలంలో ముంపునకు గురయ్యే సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు వేగవంతంగా చేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఉప్ప ల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ మోడ్రన్ బేకరీ, దేవేందర్‌నగర్ రోడ్డు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. మొదట రామం తాపూర్ మెయిన్ రోడ్, మోడ్రన్ బేకరీ సమీపంలో వర్షం పడితే నీరు నిల్వ ఉండే ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు.

## జనతా నగర్ ఎలక్ట్రిక్ వాహనాల గోదాంలో అగ్నిప్రమాదం

**మూసాపేట్, జూన్ 16, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పరిధిలోని జన తా నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మధ్యాహ్నం సుమారు 3.40 గంటలకు డయల్100కు సమాచారం అందడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంగ ణాన్ని పివిక్యూయువై కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల నిల్వ గోదాంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో గోదాంలో నిల్వ ఉంచిన పలు ఎలక్ట్రిక్ వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే నాలుగు అగ్నిమాపక వాహనాలు ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదు పులోకి తెచ్చాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయా లు జరగకపోవడం ఊరటనిచ్చే విషయం.

## సామాజిక భవనానికి మరమ్మతులు చేయండి

**- ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి**



సామాజిక భవనంలో స్థానికులతో మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి.

**జూబ్లీహిల్స్, జూన్ 16, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గాంధీపుర బస్తీలో ఉన్న సామాజిక భవనంలో దెబ్బతిన్న పై అంతస్తు మద్యభాగం మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి కోరారు. సమస్యలపై సమరంలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో ఆయన పరిశీలించారు. ఇటీవల సీసీ రోడ్డు నిర్మాణం అనంతరం మిగిలిన వ్యర్థాలను అలానే వదిలివేశారని, ఈ కారణంగా స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి ఆయా వ్యర్థాలను తొలగించాలని సూచించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో పనిచేయని విద్యుత్ దీపాలను మార్చాలని జీహెచ్ఎంసీ విద్యుత్ విభాగ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రాంచందర్, సారంగపాణి, శౌరిరాజ్, కోటేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

## కాలేజీ, స్కూల్‌లో పోలీసుల జోక్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ భాస్కర ముల్కల

**సైఫాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:** భారత్ బైబిల్ కాలేజ్ (బిబిసి), నజరీన్ గ్రామర్ హై స్కూల్‌లో పోలీసుల జోక్యం సరికాదని భారత క్రిస్టియన్ కౌన్సిల్ ఛైర్మన్, కళాశాల పూర్వ విద్యార్థి బిషప్ భాస్కర్ ములకల చెప్పారు. పాఠశాల పున :ప్రారంభం రోజునే వివాదం చెలరేగడం బాధకరమన్నారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులు పోలీసుల అండదండలతో క్యాంపస్‌లో అలజడులు సృష్టించేందుకు పయత్రిస్తున్నారని ఆరోపించారు. రెండు వర్గాలుగా ఏర్పడి బిబిసి, నజరీన్ గ్రామర్ హై స్కూల్ పరువును బజారున పడేశారని విమర్శించారు. ఈ రెండు వర్గాల గొడవుల వల్ల విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని, విద్యార్థు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రెండు వర్గాలు చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం నిజనిర్ధారణ కమి టిని వేసి చట్ట ప్రకారం అనుమతి పొందిన బోర్డు సభ్యులకు కాలేజి, స్కూల్ అప్పగించాలి భాస్కర్ ములకల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జిపిఎస్‌లో పండుగ వాతావరణంలో అక్షరాభ్యాసం



చిన్నారులచే అక్షరాలు దిద్దిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథం గుప్తా, ఉపాధ్యాయులు

**చాంద్రాయణగుట్ట, జూన్ 16, ప్రభాతవార్త :** పాతబస్తీ బండ్లగూడ మండల (విద్యా) పరిధిలోని లలితాబాగ్ జెండా వద్ద గల బేలా చందూలాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పండుగ వాతావరణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.హరి ఆధ్వర్యంలో రెండవ రోజున చిన్నారుల తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి చదువుల తల్లి శ్రీ సరస్వతీ మాతకు పూజలు నిర్వహించారు. బండ్లగూడ జోన్ ఉప పర్యవేక్షణాధికారి (డిప్యూటీ ఐఓఎస్) ఎస్. విశ్వనాథం గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. అందరిచే 'ఓం'కారం దిద్దించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఐఓఎస్ విశ్వనాథం గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్‌కు ధీటుగా విద్యాబోధన, క్రీడలు, ఐచ్ఛిక, బౌధిక్ అంశాలలో శిక్షణ నిస్తున్నట్లు తెలిపారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులు, డిజిటల్ బోధన చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న సౌకర్యాలను వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.హిందుమతి, కె.వనజ, కె.సువర్ణ, జి.ఎన్.రాధాప్యారి, కె.సరిత, ఎ.శ్రీనివాసరావు, కె.సుజాత, ఎన్.మంజుల, వి.వెంకట రామారావు, విశ్రాంత ఉపాధ్యాయులు అనిరుధరావు సాథే, బస్తీ పెద్దలు పెండెం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఆటోవాలా



ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్, సబ్ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌సాగర్, జల్థాలక్ష్మినాథ్ తదితరులు

**కుత్బుల్లాపూర్, జూన్16 ప్రభాతవార్త** రోడ్డుపై పిల్లలు ఇద్దరూ గుక్కపెట్టి ఏడుస్తున్నారు. రోడ్డుపై పోయే వాహనదారులు చూస్తూ వెళ్లిపోతున్నారే తప్ప ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇదేసమయంలో అటుగా వచ్చిన ఆటోడ్రైవర్ ఆ పిల్లలిద్దరినీ చేరదీసి వివరాలు అడిగినా వారికి తెలియడంలేదు. వారు చెప్పడంలేదు. ఇక లాభంలేదనుకుని వారిని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు చేరవేయగా పోలీసులు సోషల్‌మీడియాద్వారా విస్తృత ప్రచారంద్వారా తల్లిదండ్రుల వద్దరు చేర్చారు. జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన ప్రకారం గాంధీనగర్ పారిశ్రామిక వాడలో ఇద్దరు పిల్లలు తప్పిపోయి రోడ్డుమీద గుక్కపెట్టి ఏడుస్తూన్నారు. అటుగా వచ్చిన ఆటోడ్రైవర్ శ్రీకాంత్ ఆ ఇద్దరు పిల్లలను వివరాలు అడిగినా చెప్పడంలేదు. దీనితో తన ఆటోలో ఇద్దరు పిల్లలను జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. పోలీసుల విచారణలో ఆ ఇద్దరు పిల్లలు గాంధీనగర్ బస్టాప్‌లో నివసిస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన ఆథర్, శివాన్స్‌గా గుర్తించి వారిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. తప్పిపోయిన పిల్లలను సామాజిక బాధ్యతగా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌ను జీడిమెట్ల సర్కిల్ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్, సబ్ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ సాగర్‌లు తల్లిదండ్రుల సమక్షంలో శాలువాతో సత్కరించారు. గాంధీనగర్ వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జల్థాలక్ష్మినాథ్ అతనిమిత్రబృందం ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌ను, జీడిమెట్ల పోలీసులను అభినందిచారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయండి : ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి



ప్రసంగిస్తున్న ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి

**చిక్కడపల్లి జూన్ 16 ( ప్రభాతవార్త ) :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, తక్షణమే అపాయింట్ మెంట్ తేదీని ప్రకటించాలని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ జోనల్ కమిటీ సర్వ సభ్య సమావేశం మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా థామస్ రెడ్డి మాట్లాడుతూ సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం అనవసర కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కార్మికులందరీ కోరిక ఆర్టీసినీ ప్రభుత్వంలో విలీనం చేయడం ఒక్కటే మార్గం అని, వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేసి, అపాయింట్ మెంట్ తేదీని ఖరారు చేయాలన్నారు. ఆర్టీసీలో పదవి విరమణ చేసిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేతన బకాయిలు రాకపోవడం వల్ల విశ్రాంత ఉద్యోగులు నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. సమస్యల సాధనంలో విశ్రాంత ఉద్యోగులు తలపెట్టిన ఉద్యమానికి తెలంగాణ మద్దూర్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని థామస్ రెడ్డి ప్రకటించారు. కాగా డిపోల వారిగా కమిటీలు ఏర్పాటు చేసి యూనియన్ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యదర్శి అర్. ఎన్. రెడ్డి, కమలాకర్ గౌడ్, జి పి ఆర్ రెడ్డి, బీ.యాదయ్య, నరేందర్, కరుణ, ఎంఎస్ అలీ, శ్రీనివాస్, రవినాథ్, శంకర్, లక్ష్మణ్ సహ వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు అదిక సంఖ్యలో ఈ సమా వేశానికి హాజరయ్యారు.

## అధికారుల పర్యవేక్షణ కరువు.. స్థానికుల నిరసన

**- బాగ్ లింగంపల్లిలో డ్రైనేజీ వ్యవస్థ చిందరవందర**



చిక్కడపల్లి లలిత మాన్షన్ ఎదుట డ్రైనేజీ పనులు చేపట్టిన ప్రదేశం ఇదీ

**చిక్కడపల్లి, జూన్ 16 ప్రభాతవార్త :** బాగ్ లింగంపల్లి డివిజన్ పరిధిలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సీవరేజ్ బోర్డు అధికారుల నిర్వాకం స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈశ్వర్ రెడ్డి గల్లీ నుండి వెంకటేశ్వర మెడికల్ హాల్ వరకు చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులు అటు అపార్ట్‌మెంట్ వాసులకు, ఇటు సామాన్య ప్రజలకు శాపంగా మారాయి. కొత్త లైన్ వేసే క్రమంలో లలిత మాన్షన్ అపార్ట్‌మెంట్‌కు ఉన్న పాత డ్రైనేజీ కనెక్షన్‌ను జేసీబీతో ధ్వంసం చేశారు. కొత్త పైప్‌లైన్‌కు అనుసంధానించడంలో అధికారులు, సిబ్బంది ఘోరంగా విఫలమయ్యారు. డ్రైనేజీ నీరు బయటకు వెళ్లక అపార్ట్‌మెంట్ వాసులు అల్లాడుతుండటంతో, స్థానిక మేనేజర్ జీవన్ జ్యోతికి ఫిర్యాదు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పనులు అర్ధాంతరంగా నిలిపివేయడంతో, ఇప్పుడు కొత్త కనెక్షన్ ఎప్పుడు ఇస్తారో తెలియక అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన చెందుతున్నారు.

**రోడ్ల విధ్వంసం.. అధికారుల తీరుపై డీఈఈ ఆగ్రహం:**

క్షేత్రస్థాయిలో నాణ్యత లేని పనులు, రోడ్ల ధ్వంసంపై జీహెచ్ఎంసీ డీఈఈ గీత కుమారి మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను పరిశీలించిన ఆమె స్థానిక వాటర్ బోర్డు సెక్షన్ అధికారులు నిబంధనలను పాటించకుండా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టరుపై మండిపడ్డారు. వెంటనే పనులను నిలిపివేయాలని ఆదేశించారు. మోలిక వసతుల కల్పనలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు" అని ఆమె తేల్చి చెప్పారు. తవ్విన రోడ్డును తిరిగి ఎందుకు బాగు చేయలేదని ఆమె ప్రశ్నించారు.

**అధికారుల పర్యవేక్షణ కరువు.. స్థానికుల నిరసన:**

నిర్మాణ పనుల ఆలస్యం, అసంపూర్తిగా వదిలేసిన రోడ్ల వల్ల స్థానికులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, త్వరిత గతిన సమస్యను పరిష్కరించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా వాటర్ బోర్డు ఉన్నతాధికారులు స్పందించి, బాగ్ లింగంపల్లి పరిధిలో జరుగుతున్న పనుల నాణ్యతపై దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బడిపిల్లలకు పాఠ్యపుస్తకాలు అందజేత



పాఠ్యపుస్తకాలు స్వీకరించిన విద్యార్థులతో వనం సంగీతయాదవ్.

**జూబ్లీహిల్స్, జూన్ 16, ప్రభాతవార్త:** సోమాజీగూడ డివిజన్ హరిగేట్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్యపుస్తకాలను మంగళవారం సోమాజీగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. కార్పొరేట్ పాఠశాల పిల్లలతో పోటీపడి తమ సత్తాను చాటాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వనం శ్రీనివాస్‌యాదవ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్రమోడి పాలనపై ప్రచారం



ప్రజలకు వివరిస్తున్న బిజెపి గొల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమామహేంద్ర, మోర్చ ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వాలు

**బేగంబజార్, జూన్16ప్రభాతవార్త:** దేశానికి భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 12 సంవత్సరాల పాటుసుపరిపాలన అందించినట్లు గోల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమామహేంద్ర అన్నారు. గన్‌ఫౌండ్రిడివిజన్ పరిధిలోని ఇసామియాబజార్ తదితర ప్రాంతాల్లో నరేంద్రమోడి 12 సంవత్సరాల పరిపాలనపై ప్రజలకు తెలంగాణ బిజెపి ఎస్సీమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వాతో కలిసి ప్రచారం నిర్వహించారు. కేంద్ర నిధులతో అభివృద్ధి చేసిన ఆయుర్వేధిక్ ఆసుపత్రి సందర్శించారు. అక్కడి నుంచిబయలు దేరి ప్రముఖులతోపాటు వ్యాపారులను కలిసి నరేంద్రమోదీ దేశానికి అందించిన సుపరిపాలనపైరూపొందించిన పుస్తకాలను అందించారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా, బిజెపి నాయకులు సురేందర్, సంజయ్‌గనాటే, సురేష్, శ్రీకాంత్, నిర్మల్, కావ్య, శైలేందర్, సురేందర్‌శర్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను డయేరియా నుంచి కాపాడుకుందాం

**యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి**



**ముషీరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా చిన్నారులను డయేరియా నుంచి కాపాడుకుందామని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్టాప్ డయేరియా పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులను డయేరియా నుంచి కాపాడటం, డయేరియాపై చిన్నారుల తల్లి తండ్రులకు అవగాహన కల్పించటం కోసం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ ప్రతిష్టాత్మకంగా జూన్ 16 నుంచి జూలై 31 వరకు నిర్వహిస్తున్నారని తెలిపారు. డయేరియా నివారణలో భాగంగా ఐదేళ్ల లోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు అందివ్వటం జరుగుతుందని, ఐదేళ్ల వయసు ఉన్న చిన్నారుల తల్లి తండ్రులు తప్పకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలి



సమావేశంలో ఉషశ్రీ, సుగుణ, మామిడి మాధవి తదితరులు..

**కార్వాన్, జూన్16(ప్రభాతవార్త)** కార్వాన్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మామిడిమాధవి నాయకత్వంలో సుబ్జీమండి పార్టీ కార్యాలయంలో ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, అతిధులుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణలు పాల్గొని మాట్లాడుతూ...నారీ శక్తి వందన అధినియమ్ 2023 మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలు చేయండి, అంటూ ఆజ్ కరో, అభీ కరో నినాదంతో పోస్ట్‌కార్డులపై సంతకాల సేకరణ నిర్వహించారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ మహిళలే కాకుండా ఓబీసీ మహిళలను కూడా చేర్చాలని డిమాండ్ చేస్తూ పోస్ట్‌కార్డులపై సంతకాలు సేకరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో మహిళా కాంగ్రెస్ పాత్ర కీలక పనితీరుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో భారీ మెజారిటీ సీట్లు సాధించేందుకు మహిళా కాంగ్రెస్ పట్టుదలతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సోనియా, మారి, జి.వనజ, హేమలత, వనజ, షకీలా, అనురాధ, దుర్గ, హేమలత, సౌమ్య, సునీత, తన్య, సమీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ బడుల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి..

**కార్వాన్, జూన్16(ప్రభాతవార్త)** తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సామజిక కార్యకర్త రాజు మల్తుంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల వసూళ్ల ఇష్టారాజ్యాన్ని అడుకునేందుకు కొత్త నిబంధనలను ఈ నెలలోనే అమల్లోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, వెంటనే అమలు చెయ్యాలని రాష్ట్ర విద్యా శాఖాను కోరారు. అదేవిధంగా విద్యా సంస్థలను వసతుల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించి, ఆయా కేటగిరీలకు నిర్దిష్ట ఫీజులను నిర్ణయించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని గుర్తు చేశారు. దీనివల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు అదనపు ఫీ జుల భారం నుంచి ఉపశమనం లభించనుందని పేర్కొన్నారు.

## ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలి



ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

**సికింద్రాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:** ప్రత్యేక సర్వ సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నేతలు అంబర్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్ జాబితాను పరిశీలిస్తూ ఓట్లు లేని అర్హులైన వారందరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. అంబర్ నగర్ లో చాలామంది ఓట్లు ఓటరు జాబితాలో లేకపోవడంతో బీఆర్ఎస్ నేతలు అప్రమత్తమయ్యారు. అర్హులైన వారందరు తమ పేర్లు ఓటరు జాబితాలో ఉందో, లేదో పరిశీలించుకోవాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు విచారించకుండా ముందుగానే ఓటుహక్కు ఉన్నది, లేనిది సరిచూసుకోవాలని సూచించారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను అధికారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మందజగన్, చింతకింది మల్లేష్, జానకీరామ్ కన్నా, కిషోర్, వినోద్, భాస్కర్, కలీం, సంపత్, రోహిత్, , బల్ల గీతా, మానస ఇతర నేతలు పాల్గొన్నారు.

## విద్యుత్ డీఇ, ఏడీఇ కార్యాలయాల్లో రెచ్చిపోతున్న అవినీతి తిమింగలాలు

**అధికారుల అవినీతి లీలలు..ఇష్టారాజ్యంగా వసూళ్లు**



**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త** విద్యుత్ డీఇ, ఏడీఇ కార్యాలయాలు అవినీతి, అక్రమార్జనకు నిలయాలుగా మారాయి. హబ్సీగూడ, కీసర, సైనికపురి బోయిన్‌పల్లి, కంటోన్మెంట్, ప్యారడైజ్, డీఇ, ఏడీఇ కార్యాలయాలల్లో కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్లకు వర్క్ ఎస్టిమేషన్ నుంచి బహుళ అంతస్తులు ప్యానల్ బోర్డులు, డీటీఆర్ మీటర్ల జారీలకు అందినంత దండుకుంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఫీడర్లు ట్రిప్పయినా క్షేత్రస్థాయిలోని కొందరు అధికారులు, సిబ్బంది స్పందించకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ సమస్యలు నెలకొంటే కొందరు డీఇలు, ఏడీఇలు, ఎఇలు, లైన్‌మెన్‌లు పట్టించుకోవడంలేదు. కార్యాలయాలకు అధికారులు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వీరిపై ఉన్నతాధికారుల నిఘా కొరవడడంతో కార్యాలయాలను తమ స్వంత ఎస్టేట్లల భావిస్తూ తమకు చిత్తం వచ్చినప్పుడు కార్యాలయాలకు వస్తూ, పోతుండడతో ఆయా పనుల కోసం వచ్చే వినియోగదారులు విసిగిపోతున్నారు. విద్యుత్ కనెక్షన్ల జారీలో ఉన్నటువంటి నిబంధనలు కొందరు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. విద్యుత్ ప్యానల్ బోర్డుల ఏర్పాటులో కొందరు అధికారులు, సిబ్బంది అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్యానల్ బోర్డుల పేరు చెప్పి విద్యుత్ మీటర్ల జారీలో అందినంత దండుకుంటున్నారు. పరిమితికి మించితే కనెక్షన్లకు సంబంధించి ప్యానల్ బోర్డు ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొంటున్న అధికారులు కొందరికి మాత్రమే ఈ నిబంధనల వర్తిపంచేయడం బట్టి చూస్తే కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించంతో పాటు ఏ మేర అక్రమాలకు ప్పాలడుతున్నారో అర్థమవుతుంది. వాణిజ్య (కమర్షియల్) నిర్మాణాలు, బహుళంతస్తుల భవనాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కొత్త కనెక్షన్లకు అక్రమ వసూళ్ళు లక్షల్లో జరుగుతున్నట్లు సమాచారం. శివార్లలో వ్యక్తిగత గృహాలతోపాటు బహుళంతస్తుల భవ నాలతోపాటు కమర్షియల్ భవనాలు, విల్లాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. పెద్దఎత్తున వెలుస్తున్న నిర్మాణాలు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కొత్త కనెక్షన్ కావాలన్నా, ఇంటి ముందు అదనపు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలన్నా, కొత్త లైన్ వేయాలన్నా, అపార్ట్‌మెంట్‌లలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలన్నా పెద్ద మొత్తంలో లంచాలు ఇవ్వనిదే పనులు కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్సాఫార్మర్ల మంజూరుకు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## జంగమ్మెట్ సర్కిల్లో పర్యటించిన జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



ఛత్రినాక కూడలిలో జరుగుతున్న పనులను డిసి పాపయ్య, ఎస్ఈ నరేందర్‌గౌడ్‌లతో కలిసి పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

**చాంద్రాయణగుట్ట, జూన్ 16, ప్రభాతవార్త :** మహా నగరపాలక సంస్థ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం జంగమ్మెట్ సర్కిల్ (24)లో సుడిగాలి పర్యటన చేశారు. చాంద్రాయణగుట్ట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పాపయ్య, సూపరింటెండింగ్ ఇంజనీరు నరేందర్‌గౌడ్, ఇతర అధికారులతో కలిసి పలు చోట్ల జరుగుతున్న పనులపై క్షేత్రస్థాయిలో అధికారులతో చర్చించారు. కందికల్ నల్ల వాగులో పూడికతీత పనులను పరిశీలించి వర్షాకాలంలో వరద సమస్య రాకుండా నాణ్యతతో, వేగంగా పనులు జరగాలని ఇంజనీరింగ్, ప్రాజెక్ట్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. చారిత్రక నేపథ్యం గల రాజన్నబావిని సందర్శించారు. బావి పరిసరాలలో అపరిశుభ్రత, రక్షణ కంచె, మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న బోనాల పండుగ సందర్భంగా ప్రధాన ఊరేగింపు సాగే కందికల్‌గేట్ ఆర్వోబి, ఉప్పుగూడ, ఛత్రినాక కూడలి, లాల్‌దర్వాజా మార్గాలలో ఉన్న ఇబ్బందులను గమనించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాల వద్ద, ప్రధాన ఊరేగింపు సాగే మార్గంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వరద సమస్య లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలలో నాలాలు, కచ్చామోరి మ్యాన్‌హోల్స్, పూడిక తీత వంటి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రాజన్నబావి, లక్ష్మీనగర్, ఛత్రినాక, ఉప్పుగూడ ప్రాంతాలకు ముంపు సమస్య లేకుండా ఎస్‌డబ్ల్యూ డ్రైన్ (స్టామ్ వాటర్ డ్రైన్) నిర్మాణ పనులు చేపట్టినట్లు వివరించారు. భారీ వర్షాలతో వచ్చే సమస్యలపై తక్షణమే స్పందించేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పారిశుధ్య సమస్య లేకుండా సంబంధిత అధికారులు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. జెడ్సి వెంట ఈఈలు, డిఈలు, ఎస్‌డబ్ల్యూఎం డిఈలు, ఇతర అధికారులున్నారు.

## అభిజిత్‌పైన దాడికి బిజెపి, ఆర్ఎస్ఎస్ బాధ్యత వహించాలి

**సైఫాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజెపి) చీఫ్ అభిజిత్ దీప్కపైన బిజెపి, ఆర్ఎస్ఎస్ గుండాలు దాడి చేయడాన్ని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ చేస్తున్న విద్యార్థుల ఉద్యమానికి భయపడి ప్రధాని నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా ప్రభుత్వం అభిజిత్‌పైన దాడి చేయించారని, ఈ దాడిలో మోదీ, అమిత్‌షా, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ హస్తం ఉందని వారే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభిజిత్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపైన జరిగిన దాడిగా వర్ణించారు. దేశంలో కేంద్రం ప్రజలకు జవాబుదారిగా ఉండాలని, నీట్ పరీక్షల లీకేజీ, సీబీఎస్సీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, నీట్ లీకేజీతో మనోవేదనకు గురైన 25 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి గుండాల మాఫియాకు రోజులు దగ్గర పడ్డాయని, బిజెపి నాయకులను ప్రజలు తరిమి కోడతారని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇటికాల గణేష్, ధర్మరాజుగౌడ్, పి.మోహనరావు పాల్గొన్నారు.

### తెలంగాణ సాధనకు కృషి చేసిన వారికి సముచిత స్థానం



రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రేశం మల్లేష్ ను సత్కరిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి, జూన్ 16,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో, టీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రేశం మల్లేశకు పార్టీ పరంగా సముచిత స్థానం కల్పిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం రాంనగర్ డివిజన్ బీఆ ర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రేశం మల్లేషకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్ రెడ్డి, టీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, గ్రేటర్ నాయకుడు ఎం.ఎన్. శ్రీనివాస్ రావు హాజరై రేశం మల్లేష్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేప ట్టిన మలిదశ ఉద్యమంలో రేశం మల్లేష్ ఎంతో చురుకుగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిరి గిరి శ్యామ్, నేత శ్రీనివాస్, శివముదిరాజ్, శ్యామ్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, రాజు, గోక నవీన్, దీన్ దయాళ్ రెడ్డి పాల్గొన్నారు.



మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న హైదరాబాద్ రెల్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఈచిత్రంలో అధ్యక్షులు సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరికి జైలు

**చాంద్రాయణగుట్ట, జూన్ 16, ప్రభాతవార్త :** అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులకు కోర్టు జైలుశిక్ష విధించింది. చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి తెలిపిన ప్రకారం... పూల్‌బాగ్ నివాసి, సిసిటివి మెకానిక్ షేక్ హాషం అలీ (23) అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. పోలీసులు అతనిని విచారించగా సమాధానాలు దాట వేశాడు. అలీపై ఈపెట్టి కేసు నమోదు చేశారు. అదేవిధంగా బార్కాస్ నివాసి, వెల్డర్ మహ్మద్ అహ్మెదుద్దీన్ (28) అనుమానాస్పదంగా తిరుగుతుండగా అతనిపై ఈపెట్టి కేసు నమోదు చేసి, ఇద్దరిని నాంపల్లిలోని 9వ ఎస్.ఎం.ఎం.కోర్టు ముందు హాజరు పరిచారు. వేర్వేరుగా రెండు కేసులను విచారించిన మెజిస్ట్రేట్ పి.నర్సింగ్‌రావు నిందితుడు షేక్ హాషం అలీకి ఐదు రోజులు, మరో నిందితుడు మహ్మద్ అహ్మెదుద్దీన్‌కు మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇరువురిని పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### ద్విచక్రవాహనాల దొంగ కటకటాలపాలు

**- 14.ద్విచక్రవాహనాలు రికవరీ చేసిన నార్సింగి పోలీసులు**



**నార్సింగి, జూన్ 16 ప్రభాతవార్త :** పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించే యువకుడిని నార్సింగి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి కథనం ప్రకారం... నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు చోరీకి గురవడంతో క్రైమ్ ఎస్.ఐ వీరేశం ఈ చోరీలపై సీరియస్ ఎఫర్ట్ పెట్టారు. దీంతో జగిత్యాల జిల్లా మల్యాల మండలం, ముద్దుట్ల గ్రామానికి చెందిన ఎలనందుల బన్నీ అలియాస్ వెంకటేష్(19) పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేయడంలో సిద్ధహస్తుడని తేలింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాల చిట్టాను బయట పెట్టాడు. ఇతడి వద్ద నుంచి ఏకంగా 14.ద్విచక్రవాహనాలను రికవరీ చేశాము. సైబరాబాద్, హైదరాబాద్ పోలీసు కమీషనరేట్ల పరిధుల్లో ఇతడు చోరీలు చేసినట్లు మా దర్యాప్తులో తేలింది. ఇతడు గతంలో ఇదేరకమైన 3.కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో7, రాయదుర్గం పరిధిలో 5, గోల్కొండ, పంజాగుట్ట, ఫిలింనగర్ పోలీసు స్టేషన్ల పరిధుల్లో ఒక్కోటి చొప్పున మొత్తం 15.బైక్‌లు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఇతడిచ్చిన సమాచారం మేరకు ఇతడి వద్ద నుంచి దొంగ వాహనాలు తీసుకున్న 11. మంది నుంచి 14.బైక్‌లు రికవరీ చేశాము. దొంగ వాహనాలను కొనడం కూడా నేరం కిందకే వస్తుందని హెచ్చరించారు. వాహనాలు కొనే ముందు యాజమాన్య పత్రాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, విక్రేత వివరాలు తీసుకోవాలి. ఎవరైనా అనుమానాస్పద వాహనాలను విక్రయించేందుకు యత్నిస్తుంటే వెంటనే 100.కు సమాచారం ఇవ్వాలని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. 14.బైక్‌లను రికవరీ చేయడంలో కృషి చేసిన డిఎస్ఐ వీరేశం అతడి టీన్‌ను ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

### నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కేసులు నమోదు

**సికింద్రాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:** విద్యార్థులు పాఠశాలలకు ప్రయాణించే వాహనాలను తల్లి, తండ్రులు పరిశీలించుకోవాలని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జగన్రెడ్డి కోరారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పాఠశాలలకు విద్యార్థులతో ప్రయాణిస్తున్న ఆటోలు ఇతర వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జగన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రయాణించే వాహనాలను నిత్యం తనిఖీలు జరుపుతామని, పరిమితికి మించి విద్యార్థులను వాహనాలో తీసుకువెడుతున్నా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అలాగే వాహనాల ఫిట్నేసు కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎలాంటి అతిక్రమణలు ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు.



బడిబాట నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ప్రతినిధులు

## అంగన్‌వాడీ బడిబాట

**ఆమనగల్లు, జూన్ 16, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని అంగన్‌వాడి పదవ కేంద్రంలో మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ శాంతిరేఖ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈసందర్భంగా పలు వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈసంధర్భంగా అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహించే ప్రీ స్కూల్‌లో 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు ఉన్న చిన్నారులను చేర్పించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో పిల్లల ఎదుగుదలకు అవసరమైన పౌష్టికాహారం కూడా ఉచితంగా అందిస్తామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు చిన్నారులను పంపించి ఆర్థిక ఒడిదుడుకులకు గురి కావద్దని సూచించారు. అంగన్‌వాడిలపై విశ్వాసం పెంచుకోవాలని సిడిపిఓ శాంతిరేఖ కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అనిత కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు విద్యా శుభారంభం



సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న దృశ్యం

**షాద్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని 8వ వార్డుకు చెందిన ఆర్టీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఈరోజు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బి.ఎస్. సుధీర్, ప్రధానోపాధ్యాయురాలు వి. రజిత ఆధ్వర్యంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి వారి విద్యాభ్యాసానికి శుభారంభం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ ్మ దేవమ్మ, మాధవ చారి, వనజ, ధనలక్ష్మి ్మ తదితరులు పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. చిన్నారుల భవిష్యత్తు విద్యా ప్రస్థానానికి నాంది పలికిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా జరిగింది.

## నేటి విద్యార్థులే రేపటి భవిష్యత్తు తరాలకు పునాదులు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ రమేష్

**కేశంపేట, జూన్ 16, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామం లో మంగళవారం పాఠశాల పునఃప్రారంభం లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ పుస్తకాలు పంపిణి కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావితరాలకు, దేశ భవిష్యత్తుకు పునాదులని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ చిన్నారులను ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం టిఫిన్ మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫామ్ ఉంటాయన్నారు అన్నింటికి మించి అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని తెలిపారు. ఇన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చిన్నారులను చేర్పించాలని సర్పంచ్ రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్, ఉపాధ్యాయులు సుచరిత, షాహీన్, వార్డ్ సభ్యులు బైకని మల్లేష్ యాదవ్, సెక్రటరీ మురళి, నాయకులు శ్రీకాంత్, అనేమోని మల్లేష్ యాదవ్, బాలకృష్ణ, ఆశ వర్కర్, జ్యోతి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి నుంచే చిన్నారులకు బంగారు భవిష్యత్తు



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్, తదితరులు

**కొత్తూర్, జూన్ 16 ప్రభాతవార్త:** కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమానికి సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడి కేంద్రాలు కీలక వేదికలని పేర్కొన్నారు. బాల్యంలోనే విద్య, ఆరోగ్యం, పోషకాహారం అందించడం ద్వారా పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని అన్నారు. ప్రీస్కూల్ విద్యతో పాటు ఆరోగ్య సేవలు, పోషకాహారం అందిస్తూ ప్రభుత్వం చిన్నారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చిన్నారులకు కొత్త స్కూల్ యూనిఫామ్‌లను పంపిణీ చేసి, అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో కలిసి అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ రెడ్డి, అంగన్వాడి టీచర్లు మామిడి ఇంద్రమ్మ, కమ్మరి జ్యోతి, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, గ్రామస్తులు దేశాల జైపాల్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భవితకు అంగన్వాడీ తొలి మెట్టు

**షాబాద్, జూన్ 16, ప్రభాతవార్త :** అంగన్ వాడి అమ్మ వడి లాంటిదని ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. మంగళవారం షాబాద్ లో టీసీ కాలనీలోని అంగన్ వాడి సెంటర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పిల్లల జీవితంలో విద్య ఎంతో ముఖ్యమని, చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించాలన్నారు. అంగన్వాడీలో పిల్లలకు మంచి పౌష్టికాహారం ఇస్తామని అన్నారు. పిల్లల భవిష్యత్తుకు అంగన్వాడి తొలి మెట్టు అని అన్నారు. పిల్లలని అంగన్వాడిలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ హైమావతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



షాబాద్‌లో అంగన్‌వాడీ సెంటర్లో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ స ంధ్యారాణి

# ఇందిరమ్మ ఇల్లు మంజూరులో ప్రాధాన్యతను ఇవ్వండి

**ఆమనగల్లు, జూన్ 16, (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం రెండవ విడత మంజూరులో రాంనుంతల గ్రామ పంచాయతీకి అధిక ప్రాధాన్యతనిచ్చి ఎక్కువ మొత్తంలో ఇళ్ల మంజూరు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ శ్రీను నాయక్ ఎమ్మెల్యే కసిరెడ్డిని కోరారు. నిరుపేదలు నివాస కుటీరాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన వివరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనునాయక్ పాల్గొన్నారు. ఈ మేరకు రాంనుంతల గ్రామంలోని పలు సమస్యలను సర్పంచు ఎమ్మెల్యే దృష్టికి ప్రత్యేకంగా తీసుకువచ్చారు. గ్రామంలో వెనుకబడిన పేద, మధ్యతరగతి గిరిజన కుటుంబాలు ఇతరులు చాలామంది ఉన్నారని వారికి సరైన నివాస గృహాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు రెండవ విడత మంజూరులో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇచ్చేలా ప్రత్యేక చొరవ చూపాలని శ్రీనునాయక్ కోరారు. అంతేకాకుండా గ్రామంలో అంతర్గత మురుగు కాలువల ఆవశ్యకత గురించి వివరించి ప్రత్యేక నిధులు



ఎమ్మెల్యే కసిరెడ్డితో మాట్లాడుతున్న సర్పంచు శ్రీనునాయక్

కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందించి పేద మధ్యతరగతి కుటుంబాలకు న్యాయం చేయాలని సర్పంచ్ శ్రీను నాయక్ ఎమ్మెల్యే ని కోరారు. కార్యక్రమంలో రాంనుంతల గ్రామ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆత్మరక్షణకు కరాటే దోహదం



సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ రాము

**ఆమనగల్లు, జూన్16, ప్రభాతవార్త:** దేహధారుడ్యంతోపాటు ఆత్మరక్షణకు కరాటే ఎంతోగానో దోహదపడుతుందని ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు, మున్సిపాలిటీ కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో తమలోని ప్రతిభ పాటవాలు ప్రదర్శించవచ్చన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో కరాటే విద్య ఖ్యాతి పొందిందని వివరించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్ సీ. జగదీశ్వర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 30 మంది విద్యార్థిని విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్‌లో మంగళవారం పోటీలను నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో సర్టిఫికెట్ల ప్రధానం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కోటేశ్వరరావు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము ముఖ్య అతిథులుగా హాజరై బ్లాక్ బెల్ట్, వివిధ రకాల బెల్ట్‌లు మరియు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చిన మార్పులతో శరీరానికి శ్రమ లేకపోవడంతో ఆరోగ్యపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. చిన్నప్పటి నుండే క్రీడలతోపాటు కరాటే శిక్షణకు సమయాన్ని కేటాయించాలని సూచించారు. బాలికలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో జూనియర్ మాస్టర్ ప్రవీణ్, తల్లిదండ్రులు చందునాయక్, మహేష్, శ్రీను నాయక్, అశోక్, మహేష్, భాస్కర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# క్వారి ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 16,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తూంపల్లి గ్రామంలో క్వారి ఏర్పాటుకు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో తహసీల్దారు జగదీశ్వర్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సరిత పాల్గొని ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా కొంత మంది గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు పూర్తి సమాచారం ఇవ్వకుండ సమావేశాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. గుట్టుచప్పుడు కాకుండ ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేస్తారని వారు అధికారులను ప్రశ్నించారు. అందరికి సమాచారం ఇచ్చిన తరువాత సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు. దీనికి స్పందించిన ఆర్డిఓ క్వారి ఏర్పాటుపై ఎలాంటి సందేహాలు ఉన్న తమకు తెలుపాలని అన్నారు. గ్రామస్తులు ఇప్పుడే కాకుండ తరుతనైన వ్రాత పూర్వకంగ తమ కార్యాలయంలో అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# ఆసుపత్రుల సేవలను ప్రతిఒక్కరు వినియోగించుకోవాలి



పీడీఆర్ 01 పూడూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.సుధాకర్‌లాల్

**పూడూరు, జూన్ 16, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని వికారాబాద్ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.సుధాకర్‌లాల్ పేర్కొన్నారు. మంగళవారం పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను, మందుల ఫోరూం, లేబరేటరీ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా క్లీనిక్‌ను తప్పకుండ నిర్వహించాలన్నారు. మహిళల ఆరోగ్య పరిపక్షణకోసం ప్రభుత్వం నిర్ధేశించిన అన్ని రకాల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నిర్ధారణకోసం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది ప్రజల ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం చేయకూడదని, సమయ పాలన పాటించాలని సూచించారు. వర్షాకాలం సందర్భంగా ప్రజలకు అంటువ్యాధులు సోకకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటి డెమో వి శ్రీనివాసులు, మహేష్‌కుమార్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## కేశంపేట కాంగ్రెస్ మరింత బలోపేతం

**కేశంపేట, జూన్ 16 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ జన్మదిన వేడుకలు మంగళవారం షాద్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయము మండల, తాలూకా కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండల అధ్యక్షుడు రమేష్ కు కేకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మాజీ మండల అధ్యక్షుడు కేశంపేట గూడ వీరేశం, జంగ నర్సింహా, అరుణత్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, వీర్లపల్లి నర్సింహా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేయించి, స్వీట్లు పంచి రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండే నాయకుడిగా అనుమగల్ల రమేష్ గుర్తింపు పొందాడని కమిట్మెంట్ గల నాయకుడు రమేష్ అని కొనియాడారు . ఇకపై కేశంపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకమే తన బలం, కార్యకర్తల అభిమానమే తన సంపద, కాంగ్రెస్ సిద్ధాంతాలే తనకు మార్గదర్శకమని రమేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ విజయాల కోసం మరింత కృషి చేస్తూ ప్రజాసేవలో ముందుండాలని పలువురు కాంగ్రెస్ నాయకులు సూచించారు.

## ఎల్‌హెచ్‌పిఎస్ కార్యకర్తలను విడుదల చేయాలి

**కేశంపేట, జూన్ 16, ప్రభాతవార్త :** అక్రమంగా అరెస్టు చేసిన లంబాడి హక్కుల పోరాట సమితి కార్యకర్తలను బేషరతుగా పోలీసులు విడుదల చేయాలని అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని ఎల్ హెచ్ పి ఎస్ కేశంపేట మండల అధ్యక్షుడు జరుపుల రాజు నాయక్ అన్నారు. ఎల్ ఎస్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు లంబాడి హక్కుల పోరాటాల సమితి పిలుపుమేరకు లంబాడి హక్కుల సాధనకై సిద్ధమవుతున్న తరుణంలో అక్రమంగా పోలీసులు లంబాడీల ఇళ్ల వద్దకు చేరుకొని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అరెస్టులతో సామరస్యంగా హక్కుల సాధనకై సిద్ధమవుతున్న తమను బంధించడం సరైన పద్ధతి కాదని అక్రమంగా అరెస్టు చేసిన లంబాడి సోదరులు వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మండల అధ్యక్షుడు రాజు నాయక్‌ను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

## గోశాలకు గడి దానం చేసిన మార్వాడి సంఘం



గోశాలకు గడి దానం చేసిన యువకులు

**కొత్తూర్, జూన్ 16, ప్రభాతవార్త :**
మానవత్వానికి ప్రతీకగా నిలుస్తూ మార్వాడి సంఘం సభ్యులు మూగజీవాల పట్ల తమ ప్రేమను చాటుకున్నారు. మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన మార్వాడి సంఘం యువ నాయకుడు అరవింద్ మీర్జా ఆధ్వర్యంలో సంఘం సభ్యులు కలిసి శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామంలో ఉన్న దయాన్ ఫౌండేషన్ గోశాలకు ఒక డీసీఎం నిండా పచ్చగడ్డి, కూరగాయలను అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్ మీర్జా మాట్లాడుతూ, గోమాతల సేవ చేయడం ఎంతో పుణ్యకార్యమని, సమాజంలోని ప్రతి ఒక్కరూ మూగజీవాల సంరక్షణకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. గోశాలలో ఉన్న పశువులకు అవసరమైన ఆహారాన్ని అందించడం తమకు ఎంతో సంతృప్తిని కలిగించిందని తెలిపారు. గోశాల నిర్వాహకులు మార్వాడి సంఘం సభ్యుల సేవా భావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోజ్, వైష్ణవ్, పవన్ శర్మ, దినేష్ శర్మ, భీమ్ కుమార్, కాలు శర్మ, శంకర్ సింగ్, రాజ్ కుమార్ శర్మ, వినోద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పట్టు రైతులను ఆదుకోవాలని అధికారులకు వినతి

**తలకొండపల్లి ,జూన్ 16, ప్రభాతవార్త:**



జిల్లా అధికారులకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

రంగారెడ్డి జిల్లా పరిధిలో పట్టు పరిశ్రమ నిర్వహిస్తున్న రైతులను ఆదుకోవాలని కోరుతూ జిల్లా డి ఎసెచ్ ఓ సురేష్ కు మంగళవారం నాడు రైతులు వినతిపత్రం ఇచ్చారు. పట్టు పరిశ్రమ నిర్వహిస్తున్న జిల్లా పరిధిలోని రైతులకు ప్రభుత్వం తరఫున డ్రిప్పు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని , కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన రైతుల సబ్సిడీని వెంటనే ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. పట్టు రైతులకు ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ అధికారుల సూచన మేరకు పట్టుపురుగుల పెంపకాన్ని నిర్వహిస్తున్నామని, అయినా రైతులను ఆదుకునే విధంగా వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన రైతు సబ్సిడీల తో పాటు అదనం సబ్సిడీలను అందజేయాలని ఈసందర్భంగా వారు డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా డీఎస్వోచ్వో సురేష్, పట్టు రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శక్రూ నాయక్ దేవేందర్ వినోద్ కుమార్ చరణ్ తదితరులు ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సేవలు ప్రశంసనీయం

**షాబాద్, జూన్ 16, ప్రభాతవార్త :** గ్రామాభివృద్ధికి పంచాయితీ కార్యదర్శి సేవలు ప్రశంసనీయమని కొమరబండ సర్పంచ్ కుక్కల పద్మమ్మగోపాల్ అన్నారు. మండల పరిధిలోని కొమరబండ పంచాయితీ కార్యదర్శిగా పనిచేసిన శంకర్ విడ్కోలును ఘనంగా నిర్వహించి, సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి, పారిశుద్యం, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యదర్శి చేసిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజలతో సమన్వయం బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాడని కొనియాడారు. కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ... తనకు సహకరించిన గ్రామ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేఖర్, గ్రామస్తులు నరహరి తదితరులు పాల్గొన్నారు.



కొప్పు కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## ఉపసర్పంచుల ఫోరం కమిటీ ఎన్నిక

**ఆమనగల్లు, జూన్16, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. చింతలపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచు కొప్పు కుమార్ ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో మండల ఉపసర్పంచులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపసర్పంచుల సమస్యలపై ప్రధానంగా చర్చించి కమిటి ఎన్నికకు కార్యరూపం దాల్చారు. ఉపసర్పంచుల ఫోరం జనరల్ సెక్రటరీ మల్ల శ్రీనివాస్ ఆదేశానుసారం కొత్త కమిటిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఏకగ్రీవ కమిటీని ఎన్నుకుంటూ అధ్యక్షుడిగా కొప్పుకుమార్(చింతలపల్లి) ఉపాధ్యక్షుడిడా గడుసు రాములు (చెన్నంపల్లి) ప్రధాన కార్యదర్శిగా కృష్ణ ప్రసాద్‌గౌడ్(శెట్టిపల్లి) జాయింట్ సెక్రటరీగా రవీంద్రశ్రీను( సింగంపల్లి), కోశాధికారిగా రాజేశ్వరి మోహన్( రాంనుంతల) ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా రమేశ్(కోనాపూర్) శ్రీను (ఆకుతోటపల్లి)దేవిక నరేందర్ (సీతారాంనగర్‌తండా)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మెడిసిటి వైద్య కళాశాలలో రక్తదాన శిబిరం

**అధిక సంఖ్యలో రక్తాన్ని దానం చేసిన విద్యార్థులు, సిబ్బంది**

**మేడ్చల్, జూన్ 16, ప్రభాతవార్త :** ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఘన్‌పూర్‌లో గల మెడ సిటి వైద్య కళాశాలలో అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, పని చేస్తున్న



మెడిసిటి వైద్య కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సిబ్బందికి రక్తదానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటూ సంస్థ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అందుకుగాను ఆస్పత్రిలో గత మూడు రోజులుగా వారికి ప్రత్యేకంగా తరగతులు నిర్వహించడమే కాకుండా వారిని రక్తదానానికి ప్రోత్సహించారు. కాగా మంగళవారం వైద్య కళాశాల పాథాలజీ విభాగం అధిపతి డాక్టర్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలో బ్లడ్ బ్యాంకు ఇంచార్జ్ డాక్టర్ మాన్విత సింధు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వైద్య విద్య, నర్సింగ్, పారామెడికల్ కోర్సు విద్యార్థి, విద్యార్థిణులు 100 మందికి పైగా రక్తదానం చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారికి ముందుగా ఉచితంగా బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్, హెచ్ఐవి, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, సిఫిల్, మలేరియా తదితర పరిక్షలు నిర్వహించిన అనంతరం ఆస్పత్రిలో చికిత్సకు వచ్చే రోగులకు ఉపయోగపడేలా వివిధ బ్లడ్ గ్రూపుల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించారు. రక్తదానంతో శరీరం మరింత ఆరోగ్యవంతంగా మారడంతో పాటు మరొక విలువైన ప్రాణాన్ని కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని నిర్వాహకులు సూచించారు. అనంతరం కార్యక్రమంలో రక్తదానం చేసిన వారికి మెడిసిటి వైద్య కళాశాల తరపున సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రిన్సిపల్ దేవేంద్ర సింగ్ నేగి, మెడికల్ డైరెక్టర్ గీత, ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి జైలు శిక్ష

**మేడ్చల్, జూన్ 16, ప్రభాతవార్త :** పదకొండేండ్ల క్రితం మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి న్యాయ స్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. 2015 సంవత్సరం మే 13న మేడ్చల్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన బల్బర్ అధికారి అలియాస్ వికాస్ చత్రి బంధువుల ఇంటి దురుగా ఉన్న ఓ మైనర్ బాలికను నీళ్లు కావాలని అడిగి ఆ ఇంట్లోకి చొరబడి అనంతరం ఆమె చేతులు కాళ్లు కట్టేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న మేడ్చల్ పోలీసులు అప్పట్లో పోక్సో కేసు నమోదు చేసుకుని అతనికి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పూర్తి విచారణ జరిపిన మేడ్చల్ పోక్సో ప్రత్యేక న్యాయం స్థానం అతనికి నిందితుడిగా పేర్కొంటూ పదేండ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ 10 వేల జరిమానా విదిస్తూ తీర్పు వెలువరించింది. అదే విదంగా బాధితురాలికి రూ 1 లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించింది.

## నేడు కరెంట్ బంద్

**మేడ్చల్, జూన్ ,ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి ఫీడర్, కండ్లకోయ సబ్‌స్టేషన్ పరిధిలోని సుతారిగూడ ఫీడర్ ఏరియాలో నేడు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ గుండ్లపోచంపల్లి ఏఈ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెట్ల కొమ్మల తొలగిస్తున్నందున గుండ్లపోచంపల్లి ఫీడర్ పరిధిలోని బీరప్పగడ్డ, గోల్డెన్ లీఫ్, ఆయోధ్య ఎక్స్ రోడ్, స్టెర్లింగ్ హోమ్స్, ఖాజా గూడ, మురళీకృష్ణ వెంచర్, వెంకటరాజు గోదాం ప్రాంతాల్లో నేడు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా సుతారిగూడ ఫీడర్ పరిధిలోని సుతారిగూడ, ఏకే ఇండస్ట్రీ, మెడిప్లస్ హైర్, నన్నెముస్, ఎల్‌జీ, గుబ్బ, బీపీఎల్, హెచ్‌పీ పెట్రోల్, మేయిన్‌రోడ్, రైల్వే ట్రాక్ రోడ్, విఠల్‌రెడ్డి గోదాం, సీఎంఆర్ హస్టల్స్, ఇండస్ట్రీయల్ ఏరియాలో నేడు మద్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కరంట్ సరఫరాను ఉండదని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

**మేడ్చల్ పట్టణం....**

మేడ్చల్ పట్టణంలోని మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధి కంట్రీక్లబ్ ఫీడర్‌లోని కిందిబస్తి, రామలింగేశ్వర స్వామి టెంపుల్, వీకర్‌సెక్షన్ కాలనీ, కంట్రీక్లబ్, సత్యనగర్ కాలనీలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కరంట్ సరఫరా ఉండదని మేడ్చల్ ఏఈ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే విదంగా కిష్టాపూర్ సబ్‌స్టేషన్‌లోని ఐడీఏ హనుమాన్ ఫీడర్ పరిధి కిష్టాపూర్ గ్రామం, రావల్‌కోల్ ఇండస్ట్రీ ఏరియాలో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కరంట్ ఉండదని తెలిపారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**షాద్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దీప్కేపై జరిగిన దాడిని తెలంగాణ విద్యావంతుల వేదిక తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వేదిక డిమాండ్ చేసింది. ప్రశ్నపత్రం లీక్ కారణంగా పలువురు విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురై, ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలకు కేంద్ర విద్యాశాఖ నైతిక బాధ్యత వహించాలని పేర్కొంది. కేంద్ర విద్యాశాఖ అధిపతిగా ధర్మేంద్ర ప్రధాన్ దేశ ప్రజలకు జవాబుదారీతనం చూపించి వెంటనే పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక కోరింది. అలాగే, సిజెపి అధ్యక్షుడు అభిజీత్ దీప్కేపై దాడి చేసిన ఇద్దరు నిందితులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

**నందిగామ, జూన్ 16, ప్రభాతవార్త :** నందిగామ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు మంగళవారం ప్రధానోపాధ్యాయులు సుధాకర్ ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ , మనోహర్, వరలక్ష్మి మల్లేష్, సునీత, కృష్ణయ్య ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.